# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY — తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 237 | విశాఖపట్నం | 28-5-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 237 | VISAKHAPATNAM | 28-5-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM UPI yono SBI BHIM SBI Pay G Pay Paytm Pay


# విజన్ పాలిటిక్స్‌కు టీడీపీ నాంది

## మహానాడులో సీఎం చంద్రబాబు నాయుడు



**మంగళగిరి, పతాకం న్యూస్:** విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడువ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్‌ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. (తరువాయి 2వ పేజీలో)



# ఇసుక రీచ్‌ల్లో యథేచ్ఛగా దోపిడీ!

- ఇసుక రీచ్‌ల్లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన!
- ప్రభుత్వ ధరకు అదనంగా వసూలు చేస్తున్న నిర్వాహకులు!
- చోద్యం చూస్తున్న అధికారులు?

**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** అన్నమయ్య జిల్లాలోని ఇసుక రీచ్‌లలో దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. పేద, మధ్య తరగతి ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని ప్రవేశపెడుతూ కొన్ని నిబంధనలు పెట్టింది. అయితే ఈ నిబంధనలను పక్కనపెట్టి నిర్వాహకులు ఇష్టానుసారం వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆదాపూర్, కిచ్చమాంబాపురం, కోమంత రాజుపురం, కోమరూనీపల్లె, మదనగోపాలపురం, రాజంపేట, వేంపల్లె, నారాయణ నెల్లూరు, ఆర్.బోడుకుంట్లపల్లె–2, యర్ర మనేనిపల్లె, బాలురాజుపల్లెలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అదనంగా ఎలాంటి చార్జీలూ వసూలు చేయరాదని నిబంధన ఉంది. కానీ టిప్పర్ లోడుపై రూ.రెండు వేలు అదనంగా వసూలు చేస్తున్నట్లు టిప్పర్ యజమానులు ఆరోపిస్తున్నారు. టిప్పర్ లోడుకు రూ.8 వేలు, డీజిల్‌కు రూ.12,500, టోల్‌గేట్స్ రూ.700, డ్రైవర్ బత్తా రూ.1,200, డీఈఎఫ్ ఆయిల్ రూ.500 చొప్పున మొత్తంగా 22,900 వసూలు చేయాల్సి ఉంది. అయితే రూ.25వేలు వసూలు చేస్తున్నారు. బాలురాజుపల్లె ఇసుక రీచ్‌లో నెల్లూరుకు చెందిన కొందరు రాజకీయ నేతలు ఏజన్సీ నిర్వహిస్తున్నారు. ఒక టిప్పర్‌కు రూ.2,800 అదనంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైగా నాసిరకం ఇసుక పంపుతున్నారన్న ఫిర్యాదులూ వస్తున్నాయి. దీనికితోడు తమ రీచ్‌కే రావాలని బెదిరిస్తున్నారని టిప్పర్ యజమానులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి న్యాయం చేయాలని కోరుతున్నారు. మదనపల్లె సమీపంలో రీచ్ ఏర్పాటు చేస్తే దూరంతోపాటు ఖర్చు తగ్గుతుందని టిప్పర్ యజమానులు అభిప్రాయపడుతున్నారు. మేడికుర్తి, గుండ్లూరుల్లో ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న రీచ్‌లు జిల్లా కేంద్రానికి 150నుంచి 200 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రయాణ సమయం, డీజిల్ ఖర్చులు అధికమవుతున్నాయని వాపోతున్నారు.



5లో

ప్రాణాలు తీస్తున్న ఎండలు.. వడదెబ్బతో పది మంది మృతి

## టీడీపీ మహానాడు రికార్డు.. వర్చువల్‌గా పాల్గొన్న 6 లక్షల కార్యకర్తలు



2లో



6లో

షుగర్ వ్యాధి రావడానికి ముందే శరీరం తెలియజేసే సూచనలు..!

## లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకెళ్తుంది: ఎంపీ శ్రీభరత్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** దేశంలో గత ఏడాది వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వచ్చాయని విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్ వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ నినాదంతో సక్సెస్ అయ్యామన్నారు. బుధవారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని 42, 43వ వార్డుల క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ.. 20, 25 ఏళ్ల లోపు యువతకు పబ్లిక్ పాలసీ, రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళా బిల్లు చట్టం అమలులోకి రావడం ఖాయమన్నారు. (తరువాయి 2వ పేజీలో)

# ఇకపై మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం: లోకేశ



**మంగళగిరి, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీలో ఇకపై మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాసైనా, కాకపోయినా పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. బిగ్ అనౌన్స్ మెంట్ అని ఉదయం పెట్టిన పోస్టుకు అనుగుణంగా తన ప్రసంగంలో మహిళలకు రిజర్వేషన్ అంశాన్ని నారా లోకేశ్ ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్సీపీ పోకడలను ఎత్తి చూపారు. గొడ్డలి పార్టీ అంటే వైఎస్సార్సీపీకి కోపం వచ్చిందన్నారు. 'మాది గూగుల్ – మీది గొడ్డలి', 'మాది ఫైటర్ జెట్ – మీది ఫ్యాక్షన్', 'మాది కియా అయితే మీది కిడ్నాప్' బోత్ ఆర్ నాట్ సేమ్ అంటూ మంత్రి లోకేశ్ (తరువాయి 2వ పేజీలో)



## ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు?

2లో

## దేశంలో పెరుగుతున్న ఎండలు.. ప్రజలకు మోడీ కీలక సూచనలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎండ తీవ్రత పెరుగుతోందని పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు రోజువారీ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు పెట్టారు. ముఖ్యంగా శరీరం డీహైడ్రేట్‌కు గురికాకుండా చూసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని సూచించారు.




పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ధరల కష్టాలు..

పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రో ధరల పెంపు ద్వారా సామాన్యుడి జీవితాన్ని మరింత ప్రమాదంలోకి నెట్టేయడం ఆందోళనకరం. పొదుపు చర్యల పేరుతో ప్రధాని సుద్దులు చెప్పిన కొద్ది రోజులకే లీటర్ పెట్రోలు, డీజిల్ పై దాదాపు ఎనిమిది రూపాయలు పెంచడం ద్రవ్యోల్బణానికి మరింత ఆజ్యం పోయడమే. లీటర్ పై రూ.30 వరకూ పెంచితే తప్ప నష్టాల భర్తీ సాధ్యం కాదంటూ నిపుణుల పేరుతో కేంద్రం చేయిస్తున్న లీకులు... సామాన్యుడి బతుకును ఛిద్రం చేసేవే. పెట్రోలు, డీజిల్, సిఎన్ జి ధరలు పెరిగితే నిత్యావసర సరుకు లతోపాటు ప్రయాణాలు ప్రియమవుతాయి. యావత్ మార్కెట్ తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఇప్పటికే ఆదాయాలు క్షీణిస్తున్న నేపథ్యంలో సామాన్యుల కష్టాలు మరింత పెరుగుతాయి. అయినా పాలకులు దెబ్బ మీద దెబ్బ కొడుతున్నారు. దశల వారీగా ధరలు పెంచుతున్నారు. ఏకపక్షంగా ఇరాన్ పై యుద్ధం ప్రారంభించిన అమెరికా, ఇజ్రాయిల్... పశ్చిమాసియాతోపాటు ప్రపంచాన్ని సంక్షోభం లోకి నెట్టేసింది. 90 శాతం ఇంధన దిగుమతులపై ఆధారపడిన, ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి చేసుకునే దేశం భారత్. ఇందుకు అనుగుణంగా కేంద్రంలోని పాలకులు ఇంధన భద్రతకు ప్రాధాన్యత ఇచ్చారా అంటే అదీ లేదు. చైనా లాంటి దేశాలు భారీగా చమురును నిలువ చేసుకోగా, మోడీ సర్కారు రష్యా నుంచి చౌకగా కొనుగోలు చేసిన చమురును ప్రాసెసింగ్ చేసి, ఇతర దేశాలకు అమ్ముకునే కార్పొరేట్లకు వంతపాడటం మినహా చేసిందేమీ లేదు. గోదావరి బేసిన్ లోని చమురు నిక్షేపాలను రిలయన్స్ కు కట్టబెట్టారు. అందులో రాయల్టీగా మన రాష్ట్రానికి రావాల్సిన సగం వాటా అడిగే ధైర్యం కూడా టిడిపి, జనసేన పార్టీలకు లేకపోవడం గమనార్హం. కృష్ణా జిల్లా పామర్రులోని నిక్షేపాలు వేదాంతకు కట్టబెట్టేందుకు కసరత్తు జరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన దశాబ్దాల అనుభవం ఉన్న ఒఎన్ జిసి లాంటి సంస్థను పక్కనపెట్టి, తమిళనాట రక్తపాతం సృష్టించిన కంపెనీని ఎంపిక చేయడం ఎవరి ప్రయోజనాల కోసమో అందరికీ తెలిసిందే. ఒక నెల... మరో నెల... అంటూ అమెరికా బిచ్చమేసినట్లు అనుమతిస్తే... రష్యా నుంచి చేసిన కొనుగోళ్లను తాజా ఆంక్షలతో కేంద్రం నిలిపివేయడం ఆందోళనకరం. చౌకగా వస్తున్న రష్యా, ఇరాన్ చమురును కొనుగోలు చేయకుండా, అమెరికా, వెనిజులాల నుంచి దిగుమతి చేసుకోవడం స్వతంత్ర విదేశాంగ విధానానికి తిలోదకాలివ్వడమే. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమై 74 రోజులు గడిచే వరకూ మన దేశంలో ఇంధన ధరలు పెరగకపోవడానికి ఐదు అసెంబ్లీల ఎన్నికలు కారణం. ఎన్నికల తరువాత ధరలు పెంచేస్తారని ప్రతిపక్షాలు చేసిన ప్రచారం నిజమని తాజాగా రుజువయింది. 2024 ఎన్నికల ముందు రూ.2 తగ్గించడం, ఈ ఏడాది ఐదు అసెంబ్లీల ఎన్నికల ముందు రూ.10 పన్నులను ఉపసంహరించుకుని చమురు కంపెనీలకు ఇస్తున్నట్లు ప్రకటించడం మోడీ సర్కారు ప్రజలను మోసగించే చర్యలే. ఉపసం హరించుకున్న రూ.10 కంపెనీలకు తగ్గించారే తప్ప నేరుగా కొనుగోలుదారులకు ఎటువంటి ప్రయోజనం కలిగించలేదు. తాజాగా మనదేశంలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రి ఇంధన భద్రతకు భరోసా ఇస్తామని, ఎంత కొనుక్కుంటే అంత అమ్మడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. ఆ దేశం నిర్వాకం వల్లే దేశంలో ఇంధన భద్రత ప్రమాదంలో పడిందన్నది అందరికీ తెలిసిందే. దేశంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) మన రాష్ట్రంలోనే అత్యధికంగా ఉంది. ఢిల్లీలో పెట్రోలు ధర రూ.99.51 ఉంటే రాష్ట్రంలో రూ.117.25 ఉంది. తాము అధికారంలోకి వస్తే వ్యాట్ తగ్గిస్తామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు నోరు మెదపడం లేదు. ఇకపై పన్నులు పెంచబోమని ప్రకటించడంతోపాటు ప్రస్తుత ధరలు తగ్గించేలా కేంద్రంపైనా, వ్యాట్ తగ్గించేలా రాష్ట్రంపైనా ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలే మార్గం.

## మెరిసిపోతోన్న ఇండో పాక్ బోర్డర్!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇండో పాక్ బోర్డర్ రాత్రి పూట వెలిగిపోతోంది. సరిహద్దుల్లో విద్యుత్తు లైట్లు ధగధగలాడుతున్నాయి. ఇండియా, పాకిస్థాన్ మధ్య ఉన్న రాడ్‌క్లిఫ్ లైన్ బోర్డర్ వద్ద ఇరు వైపులా విద్యుత్తు లైట్లు మెరిసిపోతున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇండిగో పైలట్ ఆ వీడియోను షేర్ చేశారు. దట్టమైన చీకట్లో.. విద్యుత్తు కాంతులతో సరిహద్దు మెరిసిపోతున్నట్లు ఆ పైలట్ తన వీడియోలో తెలిపారు. కెప్టెన్ ప్రదీప్ కృష్ణన్ ఓ అరుదైన ఫూటేజ్‌ను పోస్టు చేశారు. అర్ధరాత్రి వేళ విమానంలో ప్రయాణిస్తున్న వారికి ఆ అద్భుత క్షణాలను ఎంజాయ్ చేసే అవకాశాన్ని పైలట్ కల్పించారు. ఎల్లో రంగులో ఉన్న ఫ్లడ్ లైట్లు చాలా సుదీర్ఘంగా దూరంగా ఉన్నట్లు కనిపించాయి. బోర్డర్ మెరుపుల గురించి విమాన ప్రయాణికులకు కెప్టెన్ కృష్ణన్ ప్రకటన చేశారు. విమాన కిటికీల్లోంచి బయటకు చూస్తే, చాలా సున్నితమైన, సురక్షితమై ప్రదేశానికి చేరుకున్నట్లు అనిపిస్తుందన్నారు. కట్టుదిట్టమై రక్షణ ఉన్న బోర్డర్‌ను చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో వరుస క్రమంలో ఉన్న లైట్లను చూసి ప్రయాణికులు ఆసక్తిగా చూసి ఆనందించారు. ఇక ఆ వీడియోకు ఆన్‌లైన్‌లో కామెంట్లు వస్తున్నాయి

## ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు?



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు ఇస్తామని గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఇప్పుడు నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి లభించే మూడు రాజ్యసభ స్థానాలకు గాను వైఎస్ షర్మిల పేరును అధిష్ఠానం ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ స్వయంగా ఇచ్చిన మాట ప్రకారం ఆమెను కర్ణాటక కోటా నుంచి ఎగువసభకు పంపించేందుకు ఢిల్లీ స్థాయిలో జోరుగా కసరత్తు సాగుతోంది. ఈ స్థానాల కోసం కర్ణాటక స్థానిక నేతలైన బీకే హరిప్రసాద్, రాజీవ్ గౌడ పేర్లు ప్రముఖంగా వినపడుతుండగా, కేంద్ర స్థాయి నుంచి కాంగ్రెస్ అధికార ప్రతినిధులు పవన్ ఖేడా, సుప్రియా శ్రీనటేల పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. వీరితో పాటు వైఎస్ షర్మిల పేరు కూడా ఈ జాబితాలో చేరడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ కోటాలో ఇప్పటి వరకు వైఎస్సార్సీపీ రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన రిలయన్స్ ప్రతినిధి పరిమళ నత్వానీ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయన మళ్లీ ఝార్ఖండ్ రాష్ట్రం నుంచి ఎగువసభకు ఎన్నికయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గతంలో ఝార్ఖండ్ నుంచి రెండు పర్యాయాలు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన నత్వానీ, ఈ విడతలో మాత్రం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఝార్ఖండ్‌లో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకదానికి జేఎంఎం అధినేత కుటుంబం నుంచి ఒక మహిళా సభ్యురాలిని బరిలోకి దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి రెండో స్థానాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తున్నప్పటికీ, ఆ పార్టీకి ఉన్న 16 మంది శాసనసభ్యుల బలం సరిపోవడం లేదు. ఝార్ఖండ్‌లో ఒక రాజ్యసభ సీటు గెలవాలంటే కనీసం 24 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కావడంతో ఇక్కడ కాంగ్రెస్‌కు సాంకేతిక సమీకరణాలు ప్రతిబంధకంగా మారాయి.

## టీడీపీ మహానాడు రికార్డు.. వర్చువల్‌గా పాల్గొన్న 6 లక్షల కార్యకర్తలు



**మంగళగిరి, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు. రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## బైజూస్ వ్యవస్థాపకుడికి ఆరు నెలల జైలు..

**సింగపూర్:** జూస్ వ్యవస్థపకుడు రవీంద్రన్‌కు ఆరు నెలల జైలు శిక్ష పడింది. కోర్టు ధిక్కారణ కేసులో సింగపూర్ న్యాయస్థానం ఈ శిక్ష విధించినట్టు వార్తలు వస్తున్నాయి. ఒకప్పుడు భారత స్టార్టప్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన ఎడుటెక్ సంస్థ ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. ఆన్‌లైన్ విద్యా రంగంలో బైజూస్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ముఖ్యంగా కరోనా సమయంలో ఆన్‌లైన్ చదువుల డిమాండ్ భారీగా పెరగడంతో కంపెనీ విలువ 2022 నాటికి 22 బిలియన్ డాలర్లకు చేరింది. అమెరికా, పశ్చిమాసియా దేశాల్లో పలు సంస్థలను కొనుగోలు చేసి దూసుకెళ్లింది. 2021లో తీసుకున్న 1.2 బిలియన్ డాలర్ల భారీ విదేశీ రుణమే కంపెనీకి పెద్ద సమస్యగా మారింది (దీఎయిబ'ం శ్రీవస్తుశ్రీ ఎ్శ్రీవ). ఆడిట్ నివేదికలు ఆలస్యం కావడం, ఆర్థిక లావాదేవీలపై అనుమానాలు వ్యక్తమవడం, భారీ నష్టాలు బయటపడటం వల్ల పెట్టుబడిదారులు ఆందోళన చెందారు. రుణదాతలు కంపెనీ నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు చేశారు. పలు దేశాల్లో కేసులు నమోదయ్యాయి.

## మోడీ 12 ఏళ్ల పాలనపై ప్రత్యేక కార్యక్రమాలు: సత్యకుమార్



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రధాని నరేంద్ర మోడీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోడీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు. జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు.

దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## విజన్ పాలిటిక్స్‌కు టీడీపీ నాంది

చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచింది. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫిల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ప్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకెళ్తుంది: ఎంపీ శ్రీభరత్

పార్టీలోకి పెద్ద ఎత్తున మహిళా శ్రేణులను తెలుగుదేశం పార్టీ ఆహ్వానిస్తోందని తెలిపారు. టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించటం శుభసూచకమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్లనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 82 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో మహానాడు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసం ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా1,850 క్లస్టర్లలో మహానాడు సమావేశాల నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలోని 81 క్లస్టర్లలో వర్చువల్‌గా నిర్వహించిన మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### ఇకపై మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తాం: లోకేశ్

వైఎస్సార్సీపీకి చురకలంటించారు. రాష్ట్రానికి పెట్టుబడిదారులు క్యూ కడుతున్నారంటే సీబీఎన్ వల్లేనని లోకేశ్ స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు నేను సిద్ధం, మీరు సిద్ధమా? అని వైఎస్సార్సీపీ నేతలకు సవాల్ విసిరారు. వైఎస్సార్సీపీకి ప్రజలే బుద్ధి చెప్పి టీమ్ 11ను అప్పగించారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమిని గెలిపించారన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ మనమే గెలవాలన్నదే గోల్ అన్న లోకేశ్, తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత అని స్పష్టం చేశారు. 2019 నుంచి 2024 వరకు పసుపు సైన్యం చేసిన పోరాటం ఒక చరిత్ర అని అన్నారు. ఆ సమయంలో ఏ ఒక్కరూ కేసులకు, అరెస్టులకు భయపడి వెనకడుగువేయలేదని గుర్తుచేశారు. తగ్గేదేలే అంటూ కొట్టిన దెబ్బకి వై నాట్ 175 కాస్తా టీమ్ 11 అయ్యిందని ఎద్దేవా చేశారు. సైకో హయాంలో బీసీలు, దళితులు, మైనారిటీలపై జరిగిన దాడులను మర్చిపోవద్దన్నారు. బాబాయిని చంపింది గొడ్డలితో కాదా, తల్లిని ఇంటి నుంచి బయటకు గెంటింది, నిజం కాదా, చెల్లికి అన్యాయం చేసి ఆస్తులు కొట్టేసింది నిజం కాదా అని నిలదీశారు. అందుకే గొడ్డలి పార్టీ అంటున్నామని అన్నారు. వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలని సూచించారు. డీఎస్సీ గురించి మాట్లాడుతున్న సైకోది టెన్త్ క్లాస్ పేపర్ కొట్టేసిన హిస్టరీ అని ఎద్దేవా చేశారు. టీచర్లను లిక్కర్ షాప్ ముందు నిలబెట్టిన హిస్టరీ గొడ్డలి పార్టీదైతే, టీచర్లను ట్రైనింగ్ కోసం సింగపూర్ పంపిన హిస్టరీ తనదని తెలిపారు. 5 సంవత్సరాల్లో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని హిస్టరీ వారిదైతే, 16,347 టీచర్ పోస్టులు ఒక్కసారిగా భర్తీ చేసిన హిస్టరీ తనదన్నారు. జాబ్ క్యాలెండర్ అని సాక్షి క్యాలెండర్ చేతిలో పెట్టిన హిస్టరీ గొడ్డలి పార్టీదైతే, 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన హిస్టరీ తనదని లోకేశ్ ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా వచ్చే పెట్టుబడుల్లో 25శాతం ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని లోకేశ్ వెల్లడించారు. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, ఫైటర్ జెట్ ప్రాజెక్టులు ఏపీకి క్యూకడుతున్నాయని తెలిపారు. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మన బలమన్నారు. నాయుడు, మోదీ, పవనన్న కాంబోతో పోలవరం, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు, అమరావతి, కర్నూల్ హైకోర్టు బెంచ్ సాధించామని యువనేత నారా లోకేశ్ పేర్కొన్నారు.

# నిబద్ధతతో పనిచేస్తే అక్షరాస్యత పెంపు: కలెక్టర్ విజయకృష్ణన్



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. 'అక్షరాంధ్ర- అక్షరాస్యత' కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్షరాంధ్ర రెండో దశలో భాగంగా 1,01,086 మంది నిరక్షరాస్యులను యాప్‌లో నమోదు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పక్షం రోజుల్లో పూర్తిచేయాలని చెప్పారు. గతంలో జరిగిన కొన్ని క్లాసులను పరిశీలించినప్పుడు వలంటీర్ల నియామకం ఆశించిన స్థాయిలో లేదని, తగిన సామర్థ్యం వున్న వారిని వలంటీర్లుగా నియమించాలని సూచించారు.

అభ్యాసకులు 100 గంటల తరగతులు పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన హాజరును అక్షరాంధ్ర యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. రెండో దశలో ఏయే అంశాల్లో వెనుకపడ్డారో గుర్తించి, మూడవ దశలో వాటిని అధిగమించి మంచి ఫలితాలు చూపించాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో నిరక్షరాస్యులకు చదువు చెప్పే వలంటీర్లలో పురుషులు తక్కువగా వున్నారని, ఈసారి వారి భాగస్వామ్యాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే అనకాపల్లి జిల్లా తక్కువగా వుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకొని జిల్లాలో అక్షరాస్యతను పెంచడానికి కృషి చేయాలని ఆదేశించారు. గత ఏడాది లక్ష మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దగా, ఈ ఏడాది కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగాలని వయోజన విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డ్వామా పీడీ నిర్మలాదేవి, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీపీఓ సందీప్, మెప్మా పీడీ రమేశ్ రామన్, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ బీవీ సత్యనారాయణ, వయోజన విద్యా శాఖ ఏడీ డి.చిన్నికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరైనా పూర్తి కాని
# రహదారుల నిర్మాణం



**అరకులోయ, పతాకం న్యూస్:** పంచాయతీరాజ్ అరకు సబ్ డివిజన్ పరిధిలో నిధులు మంజూరైనా రహదారుల నిర్మాణం పూర్తికాలేదు. నిర్దేశించిన గడువు ముగిసినా అసంపూర్తి నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటించకుండా పనులు చేపట్టారు. పీఎంన్ జన్‌మన్ పథకం కింద కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను అధికారులు, కాంట్రాక్టర్లు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఎం జన్‌మన్ పథకం కింద అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల పరిధిలో 27 రహదారులకు సంబంధించి 49.36 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం గత ఏడాది రూ.51.36 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులన్నీ ఈ ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి కావాలని గడువు విధించింది. అయితే గడువు ముగిసినా చాలా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. ఒకే కాంట్రాక్ట్ సంస్థ టెండర్లు దక్కించుకుని పనులను సబ్ కాంట్రాక్ట్‌కు ఇవ్వడం వల్లే పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని తెలిసింది. డుంబ్రిగుడ మండలంలో రూ.20 కోట్లతో 12 రోడ్ల నిర్మాణాన్ని సబ్ కాంట్రాక్టర్ చేపడుతున్నారు. ఇందులో డుంబ్రిగుడ మండలం చాపరాయి సమీపంలో కోసంగి- పెదపాడు రోడ్డును ఏడాది క్రితం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిశీలించి ఆ రోడ్డు నిర్మాణానికి రూ.1.85 కోట్లు మంజూరు చేశారు. అయితే ఆ రోడ్డు నిర్మాణం విషయంలో సబ్ కాంట్రాక్టర్ కనీస నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. దీంతో వేసిన రోడ్డు పెచ్చులూడిపోతూ అధ్వానంగా తయారైంది. దీనికి ప్రస్తుతం ప్యాచ్ వర్కు చేస్తున్నారు. అనంతగిరి, అరకులోయ మండలాలకు సంబంధించి గేటువలస, లోతేరు నుంచి బొండ్యాగుడ వరకు సుమారు రూ.2.69 కోట్లతో తారురోడ్డు వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ పనులు గడువు ముగిసినా కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే కోనాపురం నుంచి లిడ్డంగి వరకు 5.35 కిలోమీటర్ల మేర రోడ్డుకు రూ.4.89 కోట్లతో పనులు చేపట్టినా ఇంకా పూర్తి కాలేదు. అరకులోయ మండలం లోతేరు పంచాయతీ పరిధిలోని దంసానివలస నుంచి ముసిరిగుడ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రూ.3.39 కోట్లతో రహదారి పనులు జరుగుతున్నాయి. ముసిరిగుడ- దూద్‌కొండి మధ్యలో కల్వర్టు నిర్మించాల్సి ఉంది. ఈ క్రమంలో మూడు నెలల క్రితం కల్వర్టు నిర్మాణానికి 20 అడుగుల లోతున తవ్వి వదిలేశారు. దీంతో ఆయా గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇదే పంచాయితీలో శిరోస్‌గుడ నుంచి బొరకాలివలస వరకు, దంసానివలస నుంచి లండిగుడ వరకు రూ.2 కోట్లతో చేపట్టిన రహదారి పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గడువులోగా పనులను పూర్తి చేయించడం, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉన్నా ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం వల్లే ఈ రహదారులకు ఈ దుస్థితి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి ఈ రహదారులు సకాలంలో పూర్తయ్యేలా చూడడంతో పాటు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## హుకుంపేటలో గ్యాస్ కష్టాలు



**హుకుంపేట, పతాకం న్యూస్:** మండలంలో ఇండేన్ గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 22 గ్రామాల్లో గల వినియోగదారులకు హుకుంపేటలోని గ్యాస్ ఏజెన్సీ నుంచే సిలిండర్లు సరఫరా అవుతుంటాయి. అయితే గ్యాస్ సిలిండర్ బుక్ చేసి నెల రోజులు దాటిపోయినా ఇప్పటి వరకు వినియోగదారులకు సిలిండర్లు సరఫరా కాలేదు. సిలిండర్ల కోసం దూర ప్రాంతాల నుంచి రావడం, స్టాక్ రాలేదని ఏజెన్సీ సిబ్బంది చెప్పడంతో ఖాళీ సిలిండర్‌తో వినియోగదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని సంప్రతిస్తే తమకు కూడా నెల రోజులుగా స్టాక్ రావడం లేదని సమాధానం చెబుతున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## చివరి దశకు చేరిన గృహ గణన సర్వే



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జనగణన-2027లో భాగంగా జిల్లాలో చేపట్టిన గృహ గణన సర్వే చివరి దశకు చేరింది. ఈనెల 30వ తేదీలోగా సర్వే పూర్తి చేయాల్సి ఉండడంతో క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియను మరింత వేగంతం చేశారు. కలెక్టర్ విజయకృష్ణన్, డీఆర్ఓ సత్యనారాయణరావు ఆధ్వర్యంలో గృహగణన సర్వేను ఆర్డీఓలు, తహశీల్దార్లు, జీవీఎంసీ జోనల్ కమిషనర్, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,576 మంది ఉద్యోగులు సర్వేలో పాల్గొంటున్నారు. 436 మంది ఉద్యోగులు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్నారు. ఒక్కొక్క ఎన్యూమరేటర్‌కు 200 గృహాలు కేటాయించారు. కాగా వారం రోజుల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ గడువులోగా సర్వేను పూర్తిచేయడానికి అధికారులు, సిబ్బంది శ్రమిస్తున్నారు. రోజూ ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి గృహ గణన వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి ఒక సంఖ్యను కేటాయించి, గోడపై రాస్తున్నారు. వేసవి సెలవులు కావడం, కొంతమంది ఉపాధి పనుల కోసం తాత్కాలికంగా వలస వెళ్లడంతో మొత్తం మీద ఐదు శాతం ఇళ్లకు తాళాలు వేసి ఉంటున్నాయని, అటువంటి ఇళ్లకు రెండు లేదా మూడు పర్యాయాలు వెళ్లి కుటుంబ సభ్యులు అందుబాటులో వుంటే వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో మొత్తం 5,72,356 గృహాలు ఉండగా సాయంత్రానికి 5,08,587 (88.88 శాతం) గృహాల సర్వే పూర్తిచేశారు. ఈ నెల 30వ తేదీనాటికి నూరు శాతం గృహ గణనను పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నారు.

## విశాఖ 'ఉక్కు'ను వీడని అనిశ్చితి



**గాజువాక, పతాకం న్యూస్:** నాలుగేళ్లుగా విభాగాల నిర్వహణను యాజమాన్యం గాలికి వదిలెయ్యడంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అనిశ్చితి వీడడం లేదు. ఉత్పత్తికి ఏదో ఒక అవాంతరం ఏర్పడుతూనే ఉంది. కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయానికి తగ్గట్టుగానే ఉక్కు ప్రగతి ముందుకు సాగకుండా కుట్రలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలోని టిడిపి కూటమి నేతలు కేంద్రానికి వత్తాసు పలుకుతున్నారే తప్ప, ప్లాంట్ వాస్తవ పరిస్థితి తెలిసినా చక్కదిద్దే పనిచేయడం లేదు. ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకుగానూ బిఎఫ్-2లో ఆదివారం రాత్రి నుంచి ఉత్పత్తి నిలిచిపోయింది. ఇది పూర్తి స్థాయిలో పనిచేయాలంటే కనీసం మూడు రోజులు పడుతుంది. దీన్ని పునరుద్ధరించే పనిలో కార్మికులు నిమగ్నమయ్యారు. ప్లాంట్‌లోని మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకుగానూ ఒక్కొక్క దాన్నుంచి రోజుకు 17 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి జరుగుతుంది. బ్లాస్ట్ ఫర్నేస్-2లో ఏర్పడిన అంతరాయంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోనుంది. రా మెటీరియల్‌లో వచ్చిన సమస్యలే అందుకు కారణమని భావిస్తున్నారు. ఇప్పటికే పూర్తి స్థాయి ఉత్పత్తి రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్లాంట్‌కు ఈ అవరోధం గోరుచుట్టుపై రోకలిపోటులా పరిణమించింది. ఒక బ్లాస్ట్ ఫర్నేస్‌కు 19 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని కేంద్రం నిర్ణయించింది. ప్రస్తుతం 17 వేల టన్నుల ఉత్పత్తే వస్తోంది. ఇప్పటికే ఉత్పత్తితో ముడిపెట్టి ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్నందున ఉత్పత్తి అవాంతరాలు పెరిగితే కార్మికులను మరిన్ని కష్టాలు చుట్టుముట్టనున్నాయి. సాంకేతిక కారణాలు, నాణ్యమైన రా మెటీరియల్ కొరవడటంతో తరుచూ ప్లాంట్‌లో సమస్యలు వస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఆర్థిక తోడ్పాటును ప్లాంట్‌కు ఇస్తూ కాపాడే యత్నాల్లో ఉన్నాయంటూ టిడిపి కూటమి సర్కారు ప్రచారం చేస్తోంది. గత ఏడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకూ సుమారు 1,800 మంది విఆర్ఎస్ తీసుకున్నారు. రూ.100 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉన్నా యాజమాన్యం ఇవ్వడం లేదు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు రూ.300 కోట్ల పైమాటే. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు రూ.కోట్లలోనే ఉన్నాయి. ఉక్కులో ఆరు సంవత్సరాల నుంచీ ఉద్యోగులకు ప్రమోషన్స్ లేవు. ప్రతినెలా సరాసరి వంద మంది రిటైర్ అవుతున్నా రిక్రూట్‌మెంట్ జరగడం లేదు. గడిచిన నాలుగేళ్లుగా ప్లాంట్‌లో ఎలాంటి మరమ్మతులూ జరగడం లేదని కార్మికులు వాపోతున్నారు. ప్రతి డిపార్టుమెంట్‌లోనూ సమస్యలు కొలువై ఉన్నాయి. వాటిని వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## అలరించిన ఆదివాసీ నృత్యాలు, కళారూపాలు





**రాజవొమ్మంగి, పతాకం న్యూస్:** థింసా నృత్యాలు, కోలాటం, ఆదివాసీ పెళ్లి పాటలతో రేలా ఉత్సవాలు అంబరాన్నంటాయి. చివరి రోజు వీటిని చూసేందుకు పోలవరం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల వారూ రంపచోడవరానికి పోటెత్తారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కళారూపాల ద్వారా తెలుసుకుని గొప్ప అనుభూతికిలోనయ్యారు. పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో జూనియర్ కళాశాల మైదానం కిక్కిరిసింది. అడుగడుగునా కళా ప్రదర్శనలకు జన నీరాజనం దక్కింది. ఆటపాటలతో అలరించిన ఆదివాసీ కళాబృందాలు అందరి మెప్పు పొందాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హాజరై భూమి పూజ చేసి ఉత్సవాలను ఆరంభించారు. అనంతరం వేదికెక్కి ఆదివాసీ కళాకారులతో కలిసి నృత్యం చేశారు ఆదివాసీ కళాకారులు ప్రదర్శించిన థింసా అబ్బురపరిచింది. రంపచోడవరం ఏజెన్సీకి చెందిన కళాకారుల పెళ్లి పాటలు ఆకట్టుకున్నాయి. రేలా డ్యాన్సులు జోష్ నింపాయి. ప్రతి నృత్యం ఆదివాసీ సంప్రదాయాలను తార్కాణంగా నిలిచింది. వక్తలు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు అందరినీ ఎంతో ఉత్తేజపరిచాయన్నారు. రేలా ఉత్సవాల స్ఫూర్తితో గిరిజన సంస్కృతీ సంప్రదాయాల పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఉత్సవాల్లో ఎస్‌టి కమిషన్ సభ్యులు గొర్లె సునీత, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, రాష్ట్ర నాయకులు బొప్పెన కిరణ్, పులి సంతోష్ కుమార్, గిరిజన యువ నాయకులు మఠం విజయయభాస్కర్, వైస్ ఎంపిపి పి.కుమారి, ఆదివాసీ నేతలు పి.కామరాజు, పి.లింగారెడ్డి, కె.సురేష్, నిరంజనీ దేవి. కృష్ణ హైకోర్టు అడ్వకేట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీఎంఆర్‌డీఏ నిధులతో నర్సీపట్నంలో అభివృద్ధి పనులు



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నంలో అభివృద్ధి పనులకు విశాఖ మెట్రో రీజియన్ అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ఇబ్బడిముబ్బడిగా నిధులు కేటాయిస్తున్నది. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నప్రాతుడు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గత రెండేళ్ల కాలంలో మూడు విడతల్లో మొత్తం రూ.16.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పలు వార్డుల్లో 198 అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిల్లో కొన్నిపనులు ఇప్పటికే పూర్తికాగా, మిగిలిన పనులు వివిధ దశల్లో వున్నాయి. వార్డుల్లో ఇటీవల వరకు మట్టి రోడ్లుగా వున్న వీధుల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు. డ్రైనేజీ కాలువలు, అవసరమైన ప్రదేశాలతోపాటు, గతంలో నిర్మించి, శిథిలమైన కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ మొదటి విడత రూ.4.11 కోట్లు మంజూరు చేయగా, ఈ నిధులతో 43 చేపట్టారు. ఇందులో 22 సీసీ రోడ్లు, ఐదు సీసీ రోడ్లు కమ్ కాలువలు, ఒకచోట సిమెంట్ రోడ్డు, కల్వర్టు, రెండుచోట్ల కల్వర్టులు వున్నాయి. ఈ పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. రెండో విడత రూ.5 కోట్లు మంజూరుచేయగా 64 పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో సిమెంటు రోడ్లు 36, సిమెంటు రోడ్లు/ కాలువలు తొమ్మిది, సిమెంటు కాలువలు/ కల్వర్టులు 17, ఒక సామాజిక భవనం, స్కేటింగ్ రింక్ ఉన్నాయి. ఇందులో 43 పూర్తి చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో వున్నాయి. మూడో విడత రూ.8 కోట్లు మంజూరు కాగా 81 అభివృద్ధి పనులు గుర్తించారు. సిమెంటు రోడ్లు 50, సిమెంటు రోడ్లు/ కాలువ పనులు మూడు, సీసీ డ్రైనేజీ కాలువలు/ కల్వర్టు పనులు 26, బీటీ రోడ్డు/ సిమెంటు డ్రైనేజీ ఒకటి, డ్రైనేజీ/ కర్బ్‌వాల్ ఒకటి చేపట్టారు.

## మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు




**పాడేరు, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వ పథకాలతో జిల్లాలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంక దినకర్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం, పీఎం జన్‌మన్, జల్ జీవన్ మిషన్, పీఎం ఆవాస్‌యోజన, పర్యాటకానికి సంబంధించిన పనుల ప్రగతిపై ఆయన ఆరా తీశారు. అలాగే జిల్లాలో విద్య, వైద్య రంగాలను మరింతగా మెరుగుపర్చాలన్నారు. అలాగే జిల్లాలో 2024-25లో రూ.393 కోట్ల వ్యయంతో 429 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, వాటిని వేగవంతం చేయాలన్నారు. రోడ్లతో పాటు వంతెనలు, అంగన్‌వాడీ భవనాలు, హెల్త్ సబ్‌సెంటర్లు, ఆశ్రమ పాఠశాలల్లోని అదనపు భవనాల నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. పీఎం జన్‌మన్‌లో మంజూరైన 28,691 ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలని, అందుకు ప్రభుత్వం రూ.403 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ సాధనలో అల్లూరి సీతారామరాజు జిల్లా అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతి మారుమూల ప్రాంతానికి కేంద్ర, రాష్ట్ర పథకాలను అందించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఎన్‌టీఆర్ వైద్య సేవ, 102, 104, 108 సేవలపై సమగ్ర సమాచారాన్ని తెలపకపోవడంపై సంబంధిత అధికారులపై దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో ప్రజానీకానికి సేవలందించేందుకు అంకితభావంతో పని చేయాలని , నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టి.నిషాంతి, జేసీ టి.శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, డీఆర్‌వో ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఏపీ జానపదకళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ట్రైకార్ డైరెక్టర్ కూడ కృష్ణారావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## పలు జిల్లాల్లో ఈదురు గాలుల బీభత్సం




**అమరావతి, పతాకం న్యూస్:** ఒక పక్క వేడి గాలులతో ప్రజలు అల్లాడిపోతుంటే మరో పక్క ఈదురు గాలులు భీభత్సం సృష్టిస్తున్నాయి. తిరుపతి, విజయనగరం, అనంతపురం, విశాఖ, ప్రకాశం జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం ఆయా ప్రాంతాలలో అతలాకుతలం చేసింది. చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. ప్రకాశం జిల్లాలో పిడుగు పడి వ్యక్తి మృతి చెందారు. తిరుపతిలో చెట్టు కొమ్మ విరిగి పడి ఆటో ధ్వంసమయ్యింది. ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా కందుకూరు మండల, విక్కిరాల పేట గ్రామానికి చెందిన మాల కొండయ్య(60) కూలి పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో పొలంలో ఉన్న కొండయ్యపై పిడుగు పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. తిరుపతిని భారీ వర్షం ముంచెత్తింది. నగరంలో గాలి వాన వల్ల వాతావరణం ఒక్కసారి చెల్లబడినప్పటికీ నగరంలో ఉన్న ప్రైవేటు హోల్డింగ్లు, కటౌట్లు, విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు రోడ్లపై పడ్డాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అకస్మాత్తుగా మారిన వాతావరణంతో నగరవాసులు, యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాయుడుపేట మండలం కారుమంచి వారి కండ్రిగా గ్రామంలో కొంతమంది యువకులు క్రికెట్ ఆడుతుండగా వారికి అతి సమీపంలో పిడుగు పడింది. ఆ సమయంలో అక్కడే అడుతున్న తొప్పాని రవికుమార్, లతా దంపతుల కుమారుడు యశ్వంత్ (22) వద్ద మొబైల్ ఉండడంతో అది పేలి అతను కుప్పకూలిపోయారు. యశ్వత్‌ను హాస్పిటల్‌కు తరలించగా యువకుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాయుడుపేట పట్టణం ఎల్ఎ సాగరం గిరిజన కాలనీలోని ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఒక కొబ్బరి చెట్టు మీద పిడుగు పడింది చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈదురుగాలుల బీభత్సానికి తిరుపతిలోని వెస్ట్ చర్చ్ రోడ్డులో భారీ చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ఒక ఆటోపై భారీ చెట్టు కొమ్మ విరిగిపడడంతో ఆటో సగానికి పైగా ధ్వంసమైపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్‌తో పాటు ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భారీ గాలుల ధాటికి నగరంలో పలుచోట్ల రోడ్లపై చెట్ల కొమ్మలు, భారీ హోర్డింగ్లు విరిగిపడ్డాయి. దీంతో పలు మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు, విపత్తు నిర్వహణ సిబ్బంది రంగంలోకి దిగి రోడ్లపై పడ్డ చెట్లను తొలగించే పనులను ముమ్మరం చేశారు.

## ఎస్సీ కమిషన్ ఎదుట చింతల బెలగాం పంచాయితీ



**జియ్యమ్మవలస, పతాకం న్యూస్:** చింతల బెలగాం దళితుల అసైన్డ్ భూముల రికార్డుల ట్యాంపరింగ్ పంచాయితీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఎదుట విజయవాడలో జరిగింది. చింతల బెలగాం దళితులు ఆధారాలతో సహా తమకు జరిగిన అన్యాయాన్ని చైర్మన్‌కు వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన.. తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవరెడ్డికి తెలి పారని బాధిత దళితులు తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎన్. అప్పారావు వివరణ చైర్మన్ కోరారు. సరైన సమాధానం రాకపోవడంతో పాలకొండ సబ్ కలెక్టర్ పరిపాలనాధికారిని వివరణ అడిగారు. ప్రధానంగా రికార్డులు ట్యాంపరింగ్ చేసిన వారిపై, తప్పుడు రికార్డులతో అనుభవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధి కా రులను ఆదేశించారు. చర్యలు తీసుకోకుంటే చింతలబెలగాం తానే వ స్తానని హెచ్చరించారు. దళితుల కోసం న్యాయ పోరాటం చేస్తున్న తా మరకండి ప్రవీణ్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి



**సీతంపేట, పతాకం న్యూస్:** ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎక్కడ బాల్యవివాహాలు జరిగినా ఐటీడీఏ, ఐసీడీఎస్, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఆడపిల్లలను చదివిస్తే వారి భవిష్యత్తు బావుంటుందని, ఆదిశగా తల్లిదండ్రులు ఆలోచించాలని కోరారు. బాలికలు కూడా ఉన్నత చదువుల వైపు దృష్టిసారిం చాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో జి.చిన్నబాబు, డిప్యూటీ ఈవో పి.నారాయడు, జీసీడీవో రాములమ్మ, హెచ్ఎంలు కోటిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముదిరిన డంపింగ్‌యార్డు సమస్య..



**లక్కవరపుకోట, పతాకం న్యూస్:** కొత్తవలస డంపింగ్‌యార్డు సమస్య చినికిచినికి గాలి వానలా మారింది. రాజన్నకాలనీవాసులు జనసేన పార్టీ నాయకులతో కలిసి అక్కడకు వచ్చిన అధికారులను అడ్డుకుని చెత్తతో వచ్చిన ట్రాక్టర్‌ను తిరిగి పంపించేశారు. 56 రోజులుగా డంపింగ్‌యార్డుపై నిరసన తెలిపినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్య క్తం చేశారు. ప్రభుత్వం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ డంపింగ్‌యార్డు నిర్వ హిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ సీఈవో, డీపీవో, ఎంపీడీవో, పంచాయతీ ఈవోలతో కలిసిన అధికారుల బృందం డంపింగ్‌యార్డు వద్దకు చేరుకుని ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇప్పటికే స్థానిక తహసీల్దార్ ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయిం చినా.. జిల్లా అధికారులు మొండిగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త వబ్బిన సన్యాసినాయుడు మండి పడ్డారు. డంపింగ్ యార్డు ఇక్కడ నుంచి తరలించే వరకు పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు. చేసేదిలేక అక్కడ నుంచి అధికారుల వెనుతిరిగారు. రాజన్నకాలనీ వద్ద గల డంపింగ్ యార్డ్ చెత్తను మొత్తం ప్రోసెసింగ్ చేసి.. కాలుష్యం లేకుండా చేస్తామని డీపీవో మల్లికార్జునరావు తెలిపారు. జడ్పీ సీఈవో నాగ మణితో కలిసి ఆయన ప్రజలకు వివరణ ఇచ్చారు.

## వేరుశనగ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



**చింతపల్లి, పతాకం న్యూస్:** వేరుశనగ పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, గిరిజన రైతులు నూనెగింజల పంటల సాగుపై ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయశాఖ ఉప సంచాలకులు వైవీ రమణారావు తెలిపారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీలో గిరిజన రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వేరుశనగ పంట విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ ప్రోత్సహిస్తుందన్నారు. గిరిజన ప్రాంతం వేరుశనగ సాగుకు అత్యంత అనుకూలమన్నారు. గిరిజన రైతులు ఆహారం కోసం అతితక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్నారు. వేరుశనగ పంటను వాణిజ్య సరళిలో సాగు చేసేందుకు రైతులకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా విత్తనాలను పంపిణీ చేస్తుందని చెప్పారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో రెండు వేల ఎకరాల్లో వేరుశనగ సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రైతులకు వీసీసీ పథకం ద్వారా శతశాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులకు అధిన దిగుబడినిచ్చే మేలిజాతి టీసీజీఎస్ 1694 రకం విత్తనాలు అందజేశామన్నారు. విత్తనాలతో పాటు నీమ్ ఆయిల్, విత్తనశుద్ధి మందులు 50 శాతం రాయుతీపై పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు నాట్లు వేసిన నాటి నుంచి పంట కోసే వరకు సాగుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. వచ్చే ఏడాదికి సాగు విస్తీర్ణం రెట్టింపు చేస్తామని చెప్పారు. గిరిజన రైతులు ప్రభుత్వం, వ్యవసాయశాఖ అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ వేరుశనగ పంటలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బీవీ తిరుమలరావు, ఏవో టి.మధుసూదనరావు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఇద్దరి మృతి..

### ఐదుగురికి తీవ్ర గాయాలు



**సామర్లకోట, పతాకం న్యూస్:** ఉప్పాడ తీరప్రాంత మత్స్యకార కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపిన రోడ్డు ప్రమాదం సామర్లకోట మార్గంలోని ఐదు తూముల వద్ద బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రతిరోజులాగే చేపల అమ్మకాల కోసం ఆటోలో బయలుదేరిన మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళలు, ఆటో డ్రైవర్‌పై లారీ దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

ఉప్పాడ నాయకర కాలనీకి చెందిన వెర్రిపల్లి ప్రేమకుమార్ (35) ఆటో నడుపుతూ మత్స్యకార మహిళలను తీసుకెళ్తుండగా, ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంపల చిట్టమ్మ (సుమారు 40) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ ప్రేమకుమార్‌ను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గరికిన సుభద్రి, రామచెట్టి నాగమణి, వెర్రిపల్లి చిట్టమ్మ, మేకల పోలిస్వరి, దొడ్డి సత్యవతి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు, పోలీసులు సహాయంతో వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్)కు తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రతిరోజూ తెల్లవారుజామున చేపలు అమ్ముకునేందుకు వెళ్లే ఈ కుటుంబాలు జీవనోపాధి కోసం బయలుదేరి ఇలాంటి విషాదానికి గురికావడం స్థానికులను కలిచివేసింది. ప్రమాద వార్త తెలియగానే ఉప్పాడ, అమీనాబాద్, తీరప్రాంత గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతురాలు చిట్టమ్మ ఇంటి వద్ద బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. మృతి చెందిన ఆటో డ్రైవర్ ప్రేమకుమార్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ప్రేమకుమార్ ఆకస్మిక మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. చిన్నారుల భవిష్యత్తుపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "పొట్టకూటి కోసం వెళ్లిన వాళ్ల ప్రాణాలు కోల్పోవడం ఎంతో దురదృష్టకరం" అంటూ స్థానికులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అనకాపల్లిలో రైతుబజారు ప్రారంభం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** కూరగాయ పంటలను సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధరలు లభించడానికి, పట్టణ వినియోగదారులకు తాజా కూరగాయలను సరసమైన ధరలకు అందించడానికి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో 'రైతుబజారు'ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఉదయం స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌లతో కలిసి రైతుబజారును ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్కెట్ యార్డులో ఖాళీగా వున్న రెండు బ్లాకుల్లో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుబజారు నిర్వహణకు అనువుగా రూ.15 లక్షలు వెచ్చించి వసతులు కల్పించినట్టు చెప్పారు. ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ, చుట్టుపక్కల మండలాల్లో కూరగాయ పంటలను సాగు చేసే రైతులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ పచ్చికూర రాము, వైస్‌చైర్మన్ కర్రి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి డి.శకుంతల, మార్కెటింగ్ శాఖ ఏడీ అశోక్‌కుమార్, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడి, కూరగాయలను కొనుగోలు చేశారు. అనకాపల్లి, రావికమతం, కె.కోటపాడు, తదితర మండలాలకు చెందిన రైతులకు ఇక్కడ స్టాల్స్ కేటాయించారు.

## పిచ్చి కుక్క స్వైర విహారం



**బుచ్చెయ్యపేట, పతాకం న్యూస్:** బుచ్చెయ్యపేటలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఏడుగురిని తీవ్రంగా గాయపరిచింది. వీరిలో ఐదుగురు చిన్నారులు, ఓ వృద్ధురాలు కూడా ఉన్నారు. రోడ్డుపై వెళుతున్న వారితో పాటు ఇంట్లో ఉన్నవారిని కూడా పిచ్చికుక్క కరిచింది. దీంతో బుచ్చెయ్యపేటకు చెందిన సాలాపు సుమ, పోలిమరక వినోద్, పడాల హన్సిక, చంద్రిక, దిబ్బిడికి చెందిన సేనాపతి అఖిల్, సీరా కుసుమ తీవ్రంగా గాయపడడంతో వారికి స్థానిక పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి అ 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కందిపూడికి చెందిన వృద్ధురాలు కోమటి పైడమ్మకు బుచ్చెయ్యపేట పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో బుచ్చెయ్యపేట పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు. చివరకు బుచ్చెయ్యపేటలో స్థానిక యువకులు ఆ పిచ్చికుక్కను హతమార్చారు.

## కాలువలో గల్లంతైన ఇద్దరు బాలురు మృతి



**గుంటూరు, పతాకం న్యూస్:** గుంటూరు జిల్లా ప్రతిపాడు నియోజకవర్గంలోని కాకుమాను మండలంలో విషాద సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని కొల్లిమర్ల గ్రామ సమీపంలోని మద్రాసు కాలువలో దిగిన ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక సమాచారం ప్రకారం, సుమారు 15 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు బాలురు బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వచ్చారు. కార్యక్రమం అనంతరం గ్రామ సమీపంలోని మద్రాసు కాలువ వద్దకు వెళ్లిన వారు నీటిలో దిగగా ప్రమాదవశాత్తు పడి గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈతగాళ్ళు గాలింపు చేపట్టి మృతదేహాలను వెలికి తీశారు.

# రూ.2 కోట్ల బీమా డబ్బు కోసం... భర్తను చంపించిన భార్య!



**మంచిర్యాల, పతాకం న్యూస్:** మంచిర్యాల జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదం వెనుక దారుణమైన హత్య కోణం దాగి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సుమారు రూ.2 కోట్ల బీమా డబ్బు కోసం, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే ప్రియుడితో కలిసి ఓ భార్య సుపారీ ఇచ్చి చంపించినట్లు తేల్చారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. హాజీపూర్ మండలం గూడిపేట గ్రామానికి చెందిన శైని కుమార్ (45) మే 22వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు తొలుత కేసు నమోదైంది. అయితే, మృతుడి తల్లి లక్ష్మి తన కొడుకు మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో శైని కుమార్ భార్య భారతికి అదే గ్రామానికి చెందిన సురేందర్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు, వారిద్దరూ కలిసి భర్తను అడ్డు తొలగించుకోవాలని పథకం వేసినట్లు తేలింది. ఈ కుట్రలో భాగంగా రామ్ మల్లేష్ అనే వ్యక్తికి రూ.10 లక్షల సుపారీ ఇచ్చి, అడ్వాన్సుగా రూ.2 లక్షలు చెల్లించారు. పథకం ప్రకారం, మే 22న శైని కుమార్‌కు నిందితులు ఫుల్లుగా మద్యం తాగించి, ఇనుప సుత్తితో తలపై మోది హత్య చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని, బైక్‌ను రోడ్డుపై పడేసి పరారయ్యారు. ఈ కేసు వివరాలను మంచిర్యాల డీసీపీ భాస్కర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. హత్యకు పాల్పడిన భార్య భారతి, ఆమె ప్రియుడు సురేందర్, సుపారీ తీసుకున్న వారిలో ఒకడైన శ్రీరామ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మరో ప్రధాన నిందితుడు రామ్ మల్లేష్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని చెప్పారు. నిందితుల నుంచి బీమా పత్రాలు, రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

# పోక్సో కేసు.. బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసుకు సంబంధించి మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. ఈ మేరకు ప్రాసిక్యూషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ కోసం భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు మూడు రోజులకు మాత్రమే అనుమతించింది. దీంతో ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. అంతకుముందు, పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని, విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు వాడకుండా పోలీసులను ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మే 8న భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు కేసులో కఠినమైన సెక్షన్లను జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. నేరం అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

# కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు
# నేడు సీఎం సిద్ధరామయ్య రాజీనామా?



**కర్ణాటక, పతాకం న్యూస్:** కర్ణాటక రాజకీయ ముఖచిత్రం మరోసారి భారీ మార్పునకు లోనయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానంతో ఢిల్లీలో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 28న తన పదవికి రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నాటకీయ పరిణామాల నేపథ్యంలో, బుధవారం బెంగళూరులో సిద్ధరామయ్య ఒక పత్రికా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం అందడంతో రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాల నడుమ ఈ ప్రెస్‌మీట్‌ను అందరూ నిశితంగా గమనిస్తున్నారు. కాగా, సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రకు మంత్రి పదవి ఇచ్చే అవకాశం కూడా ఉందని కూడా సమాచారం. మరోవైపు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన ఢిల్లీ పర్యటనను పొడిగించుకున్నారు. అయితే గురువారం ఉదయం బెంగళూరులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సిద్ధరామయ్య ఏర్పాటు చేసిన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు ఆయన హాజరుకావలసి ఉంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటకకు చెందిన అగ్ర నాయకుల మధ్య సుమారు ఏడు గంటల పాటు సాగిన సుదీర్ఘ సమావేశం తర్వాత ఈ హై-వోల్టేజ్ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అయితే, తాము కేవలం రాజ్యసభ, లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికల గురించే చర్చించామని కాంగ్రెస్ పార్టీ పైకి చెబుతున్నప్పటికీ, లోపల మాత్రం నాయకత్వ మార్పుపైనే ప్రధానంగా చర్చ సాగినట్లు పొలిటికల్ వర్గాల సమాచారం.

# ప్రాణాలు తీస్తున్న ఎండలు.. వడదెబ్బతో పది మంది మృతి



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎండల తీవ్రతకు ప్రజానీకం విలవిలలాడుతోంది. ఎండల ధాటికి తట్టుకోలేక మరణిస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మరణాల సంఖ్య పెరుగుతుండటంతో బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలన్న డిమాండ్ కూడా పెద్ద ఎత్తున వినిపిస్తోంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఈ దిశలో నిర్ణయం తీసుకోవడంతో ఆంధ్రప్రదేశ్లోనూ వడదెబ్బ మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వివిధ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే మరణించిన వారి సంఖ్యకు అదనంగా వడదెబ్బ కారణంగా మరో పది మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. మరణించిన వారిలో ముగ్గురు ఉపాధి కార్మికులు ఉన్నారు. ఈ సంఖ్య మరింతగా కూడా పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఎండల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకుంది. భారీ ఎండలనుండి కోళ్లను కాపాడుకోవడానికి చేస్తున్న కోళ్ల ఫారాల యజమానులు నానా తిప్పలు పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఒకే ఫారంలో 1900 కోళ్లు మృతిచెందడం పరిస్థితి తీవ్రతను తెలియచేస్తోంది. అదే సమయంలో అల్పపీడనం కారణంగా అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షాలు కురిసినప్పటికీ మరో మూడు రోజుల పాటు ఎండల తీవ్రత ఇదే మాదిరి కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది. వడదెబ్బకు వేర్వేరు జిల్లాల్లో మంగళవారం పదిమంది మృతిచెందారు. వారిలో ఉపాధి కార్మికులు ముగ్గురున్నారు. పల్నాడు జిల్లాలోని మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన మాజీ సర్పంచ్ పడాల వెంకిరెడ్డి (82) వడదెబ్బకు గురై మృతి చెందారు. కొద్ది రోజులుగా తీవ్రమైన ఎండల కారణంగా అస్వస్థతకు గురైన ఆయనను నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా మంగళవారం మరణించారని కుటుంబీకులు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో సర్పంచ్‌గా పని చేసిన వెంకిరెడ్డి భౌతికకాయాన్ని టిడిపి, వైసిపి నాయకులు, సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విజయనగరం జిల్లా గంట్యాడ మండలం రాజుల పొల్లంకి గ్రామానికి చెందిన సిరిపూరి సన్యాసిరాజు (70) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. ఎప్పటిలాగే గ్రామ సమీపంలోని కర్రివాని చెరువులో ఉపాధి పని చేసేందుకు మంగళవారం ఉదయం వెళ్లారు.

కొంత సమయం తరువాత ఎండ తీవ్రతను తట్టుకోలేక పనిప్రదేశంలోనే కుప్పకూలిపోయారు. దీంతో తోటి కార్మికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి సన్యాసిరాజును అంబులెన్స్ దగ్గరకు తీసుకు వస్తుండగా మృతి చెందారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాటు మండలం గుల్లేపల్లి గ్రామానికి చెందిన డొప్ప శ్రీరామ్మూర్తి (46) వడదెబ్బతో మృతిచెందారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా నల్లగొండ ఏరియాలో ఉపాధి కార్మికులతో కలిసి కందకాలు తవ్వుతున్న క్రమంలో ఎండ తీవ్రంగా ఉండటంతో ఆయన అస్వస్థతకు గురయ్యారు. కె.కోటపాడులోని ఆస్పత్రికి తీసుకెళ్లే సరికే మృతిచెందారు. బాపట్ల, మార్కాపురం జిల్లాల్లో వడదెబ్బకు ఇద్దరు మృత్యువాత పడ్డారు. వెలిగండ్ల మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్డి చిన మాలకొండయ్య (78) వడదెబ్బకు మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. బాపట్ల జిల్లా, యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన వికలాంగుడు పోలిశెట్టి సుధాకర్ (43) మూడు రోజుల క్రితం వడదెబ్బకు గురయ్యారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఎస్ బి ఆర్ పురం పంచాయతీ పరిధిలోని పాత ఎస్టి కాలనీకి చెందిన నగరి నియోజకవర్గ టిడిపి ఎస్టి సెల్ అధ్యక్షుడు వెంకటేష్ సోదరుడు విడదల కిషోర్ (40) వడదెబ్బకు గురై మృతి చెందారు. ఉపాధి పనుల నిమిత్తం బయటకు వెళ్లిన ఆయన ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురై రక్తపు వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయారు. దీంతో స్థానికులు గుర్తించి పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం నాగవరప్పాడు బస్ షెల్టర్ లో గుర్తు తెలియని మహిళ వడదెబ్బకు మృతిచెందినట్లు ఎస్ఐ యు.గోవింద్ తెలిపారు. ఆ మహిళ బస్ షెల్టర్ లో మృతిచెంది ఉన్నారు. వడదెబ్బకు గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో రోడ్డు పక్కన పడిపోయి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ చనిపోయారు. ఏలూరు జిల్లా చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన తోట సీతామహాలక్ష్మి (38) వడదెబ్బకు గురై సోమవారం రాత్రి మృతి చెందారు. సోమవారం సాయంత్రం టాబ్లెట్లు కోసం సీతామహాలక్ష్మి బయటికెళ్లొచ్చి బాగా నీరసపడిపోయారు. కొద్దిసేపటికే విరోచనాలు కావడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి సీతామహాలక్ష్మి ప్రాణాలు కోల్పోయారు. ముదినేపల్లి మండలంలోని కొర్రగుంటపాలెంకు చెందిన శతాధిక వృద్ధురాలు కొండూరి అనసూర్యమ్మ (104) మంగళవారం తెల్లవారుజామున వడదెబ్బతో మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. దానికితోడు ఎండ వేడిమి, తీవ్ర వడగాల్పులకు తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు. రాష్ట్రంలో బుధవారం నాడు 68 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 93 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పోలవరం, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా మంచినీరు వెంట తీసుకుని వెళ్లాలని కోరారు. పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు పట్ల అప్రమత్తంగా ఉండలన్నారు. మరోవైపు ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని, దీని ప్రభావంతో బుధవారం నాడు చిత్తూరు జిల్లాలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

# ఓటరు జాబితాల రూపకల్పనకు సహకరించాలి



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటర్ల జాబితాను స్వచ్ఛంగా, నిర్దిష్టంగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరించాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్ని రాజకీయ పార్టీలనూ కోరారు. రాష్ట్ర సచివాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమై భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమం అమలుపై చర్చించారు. ఈ సందర్భంగా వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా వేగవంతమైన పట్టణీకరణ, ఉపాధి, విద్యా అవసరాల కోసం జరిగిన వలసలు, జనాభా మార్పులు వంటి పరిణామాల కారణంగా ఓటరు జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ నమోదులు ఉండడం, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లు తొలగించకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ కార్యక్రమం ఈ ఏడాది జులై ఒకటి అర్హత తేదీగా నిర్ణయిస్తూ అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 5 నుంచి 14 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, గణన ఫారాల ముద్రణ చేపడతామన్నారు. 15వ తేదీ నుంచి జులై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి గణన ఫారాల పంపిణీ, సేకరణ నిర్వహిస్తారన్నారు. పోలింగ్ స్టేషన్ల సహేతుకీకరణ కార్యక్రమం జులై 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా జులై 21న ప్రచురించబడుతుందని, క్లైములు, అభ్యంతరాల స్వీకరణకు జులై 21 ఆగస్టు 20 వరకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నోటీసులు, విచారణలు, దావాలు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ జులై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందన్నారు. అన్ని ప్రక్రియలు పూర్తయిన తర్వాత తుది ఓటరు జాబితా ఈ ఏడాది సెప్టెంబరు 22 ప్రచురించనున్నట్లు తెలిపారు. ఆధార్ కేవలం గుర్తింపు రుజువు మాత్రమేనని, అది పౌరసత్వం లేదా నివాసానికి చట్టబద్ధమైన రుజువు కాదని స్పష్టం చేశారు. అయితే ఎన్నికల చట్టాల ప్రకారం గుర్తింపు నిర్ధారణ కోసం ఆధార్‌ను ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. ఎటువంటి వ్యక్తి పేరు అయినా విచారణ లేకుండా, కారణాలతో కూడిన ఉత్తర్వు జారీ చేయకుండా ఓటరు జాబితా నుండి తొలగించబడదని హామీ ఇచ్చారు. వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, దళితులు, గిరిజనులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ప్రత్యేక సహాయ సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి పౌరుడు ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి, తమ గణన ఫారాలను సక్రమంగా సమర్పించాలన్నారు. ప్రజాస్వామ్య బలోపేతం కోసం ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు భ్యులు దుకు అన్ని రాజకీయ పార్టీలూ సహకరిం చాలని వివేక్ యాదవ్ కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, నాయకులు జె జయరాం, టిడిపి ప్రతినిధులు పి అశోక్ బాబు, కోనేరు సురేష్, కె రాజశేఖర్, జనసేన పార్టీ తరపున ఇ సాంబశివ ప్రతాప్, వైసిపి ప్రతినిధులు పేర్ని నాని, ఎల్ అప్పిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎఎన్ఎన్ మూర్తి, ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, బిజెపి ప్రతినిధులు ఎన్ రమేష్ నాయుడు, వి శ్రీనివాసరాజు, వెన్న హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్ట్‌లో సిఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు



**పోలవరం, పతాకం న్యూస్:** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో కేంద్ర మట్టి, పదార్థాల పరిశోధనా సంస్థ (సిఎస్ఎంఆర్ఎస్) బృందం పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలు బుధవారం కూడా కొనసాగ నున్నాయి. ఈ బృందంలో సిఎస్ఎంఆర్ఎస్‌లోని మట్టి, వివిధ పదార్థాల పరీక్షల నిపుణులు సిద్దార్థ్ పి హెడవూ, శ్రీ హరి టి నాయర్, గౌరవ్ పాండే ఉన్నారు. వీరు మంగళవారం గ్యాప్ -1 ప్రాంతంలో ఏడు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రాజెక్ట్ నిర్మాణంలో వినియోగిస్తున్న, మట్టి, పదార్థాలు, రాళ్లు అన్నీ నాణ్యతగా ఉన్నాయని అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. ఈ పరీక్ష నిర్వహించటానికి ఏడు గంటల సమయం పట్టింది. బుధవారం గ్యాప్ -2లో ఈ బృందం ఇదే తరహా పరీక్షలు నిర్వహించనుంది. సిఎస్ఎంఆర్ఎస్ బృందం వెంట జలవనరుల శాఖ డిఇలు శ్రీకాంత్, విజయ్ కుమార్, ఎంఇఐఎల్ పోలవరం ప్రాజెక్ట్ జిఎం ఎ.గంగాధర్, డిజిఎంలు మురళి పమ్మి, గుట్టపాటి శంకరయ్య ఉన్నారు.

## రక్షణ కల్పించండి: ప్రొఫెసర్ నాగేశ్వర్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** గత కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో తనకు రకరకాల బెదిరింపులు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తెలంగాణ డిజిపి సివి ఆనంద్‌ను కోరారు. ఆయన నాయకులతో కలిసి హైదరాబాద్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డిజిపిని కలిశారు. ఆన్‌లైన్ ద్వారా తనకు వచ్చిన బెదిరింపుల మెసేజ్‌లను అందజేసి పరిశీలించాల్సిందిగా కోరుతూ డిజిపికి వినతిపత్రం అందజేశారు. డిజిపి స్పందిస్తూ, తగిన రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డిజిపి కార్యాలయం వెలుపల మీడియాతో కె నాగేశ్వర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో తనకు వచ్చిన బెదిరింపులపై చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరినట్లు తెలిపారు. ఒక రాజకీయ పార్టీకి సంబంధించి గతంలో తాను చేసిన కామెంట్లను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించానని, దాన్ని జనసేన పార్టీ కూడా ఆహ్వానించి... ఇంతటితో ఆ వ్యవహారాన్ని వదిలేయాలని, అది ముగిసిన అధ్యాయమని ఆ పార్టీ తమ కేడర్‌కు కూడా విజ్ఞప్తి చేసిందని నాగేశ్వర్ గుర్తుచేశారు. వ్యాఖ్యలను ఎందుకు ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని విలేకరులు ప్రశ్నించగా, ఉపసంహరించుకున్న వ్యాఖ్యలపై మాట్లాడనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి తనకు ఇప్పటివరకు ఎటువంటి నోటీసూ అందలేదని, తమ ఇంటికి ఎపి పోలీసులు కూడా రాలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా నాగేశ్వర్ వివరణ ఇచ్చారు.

## ‘పెట్రో’ ధరల భారంపై నిరసనలు

**నంద్యాల, పతాకం న్యూస్:** పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో౦ నిరసన తెలిపారు. గడిచిన పది రోజుల్లో ఇంధన ధరలు పెరగడం ఇది నాలుగోసారి అని, యుద్ధాని బూచిగా చూపిస్తూ ఇంధన ధరలను రోజురోజుకూ పెంచుతూ సామాన్య మానవుడి నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదాని, అంబాని వంటి బడా పారిశ్రామికవేత్తలు, ప్రైవేట్ ఆయిల్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకే సామాన్యులపై భారం వేస్తున్నారని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాలలో స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ప్రజల పై భారాలు వేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి దేశాన్ని పాలించే అర్హత లేదని, తక్షణమే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కారు అంటూ ప్రజలపై భారాలు వేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు.

## పంచాయతీ సిబ్బందికి రేవంత్ సర్కారు తీపి కబురు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ‘లేపాక్షి’ ఉద్యోగులకు జీతాల పెంపు : మంత్రి సవిత



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న లేపాక్షి దుకాణాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం అందుతున్న మూల వేతనాన్ని అదనంగా 10 శాతానికిపైగా పెంచుతూ చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను లేపాక్షి దుకాణాల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలిసి, పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గడిచిన రెండేళ్ల నుంచి అమ్మకాలు పెంచినట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ.. లేపాక్షి దుకాణాల్లో 2024-25లో రూ.56.47 కోట్లు, 2025-26లో రూ.60.75 కోట్ల మేర అమ్మకాలు జరపడంపై ఉద్యోగులను అభినందించారు. పెరిగిన అమ్మకాలను దృష్టిలో పెట్టుకుని ఆయా ఉద్యోగుల స్థాయిని బట్టి 10 శాతానికి పైగా జీతాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రూ.80 కోట్లకు అమ్మకాలు పెంచాలని దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 19 లేపాక్షి దుకాణాలు ఉన్నాయన్నారు. త్వరలో రాజమండ్రి ఎయిర్‌పోర్టులో నూతన దుకాణాన్ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అన్ని లేపాక్షి దుకాణాలను నేటితరం అభిరుచులకు అనుగుణంగా మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. హస్త కళాకారులకు ఆర్థిక భరోసా కలిగించేలా 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. జీతాల పెంపుపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఎపిహెచ్‌డిసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు రాజు, మహేశ్వరరావు, బాలాజీ, భారతి, చంద్రశేఖర్, సుబ్బరావు, కిషోర్ కుమార్, సుధారాణి తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో 20 మందికి గాయాలు

**నెల్లూరు, పతాకం న్యూస్:** కోవూరు మండలం పడుగుపాడు వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నెల్లూరు నుంచి కావలికి వెళ్తున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు, ఎక్స్‌కవేటర్ ఢీకొన్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లతో పాటు సుమారు 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు తీవ్రంగా శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసుకొచ్చారు.

# షుగర్ వ్యాధి రావడానికి ముందే శరీరం తెలియజేసే సూచనలు..!



వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరిని వేధిస్తున్న అనారోగ్య సమస్యల్లో మధుమేహం కూడా ఒకటి. ఈ వ్యాధితో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని చెప్పవచ్చు. అయితే మధుమేహం ఒక్కసారిగా వచ్చే వ్యాధి కాదని, దానికి ముందే శరీరం చిన్న చిన్న సంకేతాల ద్వారా హెచ్చరిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబు తున్నారు. సాధారణంగా ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత, వయస్సు ప్రభావం లేదా ఆందోళనగా భావించే కొన్ని లక్షణాలు వాస్తవానికి ఇన్సులిన్ రెసిస్టెన్స్‌కు సంకేతాలు అవుతాయని తాజా వివరణలు చెబుతున్నాయి. చాలామంది ఈ సూచనలను సంవత్సరాల పాటు పట్టించుకోకపోవడం వల్ల తరువాత టైప్-2 డయాబెటిస్ బారిన పడుతున్నట్లు పేర్కొంటున్నారు. అలాగే టైప్ 2 డయాబెటిస్ ను సూచించే కొన్ని లక్షణాలను కూడా తెలియజేస్తున్నారు. శరీరంలో ఇన్సులిన్ స్థాయిలు అధికంగా ఉన్నప్పుడు మెడ, చేతి కింద భాగాలు లేదా తొడల దగ్గర చిన్న చిన్న స్కిన్ ట్యాగ్స్ కనిపిస్తాయని నిపుణులు వివ రిస్తున్నారు. ఇవి సాధారణ చర్మ సమస్యలుగా కనిపించినా, వాస్తవానికి శరీరంలో హైపర్ ఇన్సులినిమియా ఉన్నట్లు సూచించే సంకేతాలుగా చెబుతున్నారు. రక్తంలో ఇన్సులిన్ మోతాదు ఎక్కువగా ఉండడం వల్ల ఈ మార్పులు కనిపించే అవకాశం ఉంటుందని అంటున్నారు. అలాగే మెడ చుట్టూ నల్లగా, వెల్వెట్‌లా కనిపించే చర్మపు మచ్చలను అకాంథోసిస్ నైగ్రికాన్స్‌గా పిలుస్తారు. ఇది కూడా అధిక ఇన్సులిన్ ప్రభావంతో చర్మ కణాలు ఎక్కువగా స్పందించడం వల్ల ఏర్పడుతుంది. రక్త పరీక్షల్లో సమస్య బయటపడకముందే చర్మం ఈ మార్పుల ద్వారా హెచ్చరిక ఇస్తుంది. అదే విధంగా రాత్రి 3 నుంచి 4 గంటల మధ్య అకస్మాత్తుగా మేల్కొనడం, గుండె వేగంగా కొట్టుకోవడం, ఆందోళనగా అనిపించడం వంటి లక్షణాలు కూడా రక్తంలో చక్కెర స్థాయిల మార్పులతో సంబంధం ఉంటాయి. నిద్రలో బ్లడ్ షుగర్ ఒక్కసారిగా తగ్గిపోతే శరీరంలో కార్టిసోల్, అడ్రినలిన్ వంటి స్ట్రెస్ హార్మోన్లు విడుదలై ఈ లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. చాలామంది దీన్ని కేవలం ఆందోళన సమస్యగా భావిస్తారు. భోజనం చేసిన తర్వాత మధ్యాహ్న సమయంలో తీవ్రమైన అలసట రావడం కూడా రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి మళ్లీ పడిపోవడం వల్ల అవుతుంది. దీనిని రియాక్టివ్ హైపోగ్లైసీమియాతో అనుసంధానిస్తారు. ముఖ్యంగా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్న తర్వాత ఈ పరిస్థితి కనిపిస్తుంది.

ఎక్కువగా వ్యాయామం చేసినా, తక్కువగా తిన్నా పొట్ట చుట్టూ కొవ్వు తగ్గకపోవడం కూడా అధిక ఇన్సులిన్ ప్రభావమే అవుతుందని నిపుణులు వివరిస్తున్నారు. ఇన్సులిన్ అధికంగా ఉన్నప్పుడు శరీరంలో కొవ్వు కరిగే ప్రక్రియ నెమ్మదిస్తుంది. అందువల్ల బరువు తగ్గడం కష్టమవుతుంది. కేవలం కేలరీలు తగ్గించడం లేదా వ్యాయామం మాత్రమే చాలదు. హార్మోన్ల సమతుల్యత కూడా కీలకం. తీపి పదార్థాలపై అధిక కోరిక కూడా రక్తంలో చక్కెర మార్పులతో సంబంధం ఉంటుంది.

చక్కెరను ఎక్కువగా తీసుకున్నప్పుడు మెదడులో డోపమైన్ పెరిగి తాత్కాలిక ఆనంద భావన కలుగుతుంది. తరువాత బ్లడ్ షుగర్ తగ్గిపోతే మళ్లీ తీపి పదార్థాల కోసం శరీరం కోరుకుంటుంది. ఇది వ్యక్తిగత బలహీనత కాదు, శరీరంలో జరిగే రసాయన మార్పుల ప్రభావం. అలాగే భారతీయుల జీవనశైలిలో మార్పులు కూడా మధుమేహం పెరగడానికి ప్రధాన కారణమవుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. టీతో పాటు బిస్కెట్లు తీసుకోవడం, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే అల్పాహారం, తగినంత ప్రోటీన్ లేకుండా భోజనం చేయడం, నిద్రలేమి, ఒత్తిడి, కూర్చునే జీవనశైలి, అధిక చక్కెర వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాన్ని పెంచుతున్నాయి. భోజనం చేసిన వెంటనే నిద్రగా అనిపించడం, ఎప్పుడూ ఆకలిగా ఉండటం, సాయంత్రం అలసట, పొట్ట చుట్టూ కొవ్వు తగ్గకపోవడం వంటి లక్షణాలను చాలామంది సాధారణ సమస్యలుగా తీసుకుంటారు. అయితే ఇవి భవిష్యత్తులో మధుమేహానికి సంకేతాలు అవుతాయి. శరీరం ముందుగానే ఇచ్చే ఈ చిన్న సంకేతాలను గుర్తిస్తే, జీవనశైలిలో మార్పులు చేసి మధుమేహాన్ని ముందుగానే నియంత్రించే అవకాశం ఉంటుంది.

# వరి పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్న రైతులు

## 85 కేజీల బస్తాకు రూ.1400 చెల్లింపు.. తీవ్రంగా నష్టపోతున్న రైతులు



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటను అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రధానంగా తేలిక రకాలైన 1010, తరంగిణి ధాన్యం కొనుగోలు జరగడం లేదు. నూక శాతం ఎక్కువ వస్తుందనే కారణంతో ఈ రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ఇష్టపడడం లేదు. దీంతో చేసేది లేక రైతులు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని బోయల్డ్ రైస్ మిల్లులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేసి తక్కువ ధరకు అడుగుతున్నారు. 80 కేజీల బస్తాకు ఐదు కేజీలు అదనంగా తీసుకొని రూ.1400 చెల్లిస్తున్నారు. చేసేది లేక వారు అడిగిన ధరకే ధాన్యం విక్రయిస్తూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలోని జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వీరఘట్టం, పార్వతీపురం, కురుపాం, సాలూరు, వీరఘట్టం, పాలకొండ, భామిని, సీతానగరం తదితర మండలాల్లో ఈ ఏడాది రబీలో 20 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఎక్కువమంది 1010, తరంగిణి తదితర రకాలు వేశారు. ఖరీఫ్‌తో పోల్చుకుంటే రబీలో ఎకరాకు 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. అయితే దిగుబడి బాగున్నా గిట్టుబాటు ధర మాత్రం దక్కడం లేదు. ఖరీఫ్‌లో ప్రభుత్వం 80 కేజీల సాధారణ రకాన్ని రూ.1895కు కొనుగోలు చేసింది. రబీకి సంబంధించి అధికారికంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు 80 కేజీల బస్తాను రూ.1400కే కొనుగోలు చేస్తున్నారు. పైగా బస్తాపై ఐదు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. మిషన్‌తో కోత చేసి తక్షణమే అమ్మకాలు చేసేవి (పచ్చి ధాన్యం) 85 కేజీలకు కేవలం రూ.1150 నుంచి రూ.1200 మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ ధరతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో సాగు చేసిన 1010, తరంగిణి వంటి తేలికపాటి రకాల ధాన్యంను స్థానిక మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. ఆ ధాన్యం మరపడితే నూక శాతం అధికంగా వస్తుందనే ఆలోచనతో కొనుగోలు చేసేందుకు విముఖత కనబరుస్తున్నారు. వాస్తవానికి రైస్‌మిల్లర్లు బియ్యాన్ని సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అందుకోసం నాణ్యమైన ధాన్యం కోసం వేచిచూస్తుంటారు. ఈ నేపథ్యంలోనే తేలికపాటి రకాలను కొనుగోలు చేసేందుకు ఇష్టపడడం లేదు. కొంతమంది మిల్లర్లు ఒడిశాలో ధాన్యం కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంటున్నట్టు తెలుస్తుంది. మరోపక్క జిల్లాలో బోయల్డ్ రైస్ మిల్లులు అందుబాటులో లేవు. నూక శాతం ఎక్కువ ఉన్నా 1010, తరంగిణి వంటి తేలికపాటి రకాలను ఈ మిల్లులు కొనుగోలు చేస్తుంటాయి. ఇలాంటి మిల్లులు కేవలం తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. రైతులు చేసేది లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. వీరు రైతుల నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేసి బోయల్డ్ రైస్ మిల్లర్లకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఫలితంగా ఎండ పెట్టిన ధాన్యంపై బస్తాకు రూ.500 వరకు, పచ్చి ధాన్యంపై బస్తాకు రూ.700 వరకు నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

# తొలి హైడ్రోజన్ రైలుకు గ్రీన్ సిగ్నల్..

## ప్రత్యేక దేశాల జాబితాలో చేరిన భారత్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పర్యావరణ హితమైన, సుస్థిర రవాణా దిశగా భారత రైల్వే ఒక చరిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడిచే రైలును ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. ఉత్తర రైల్వే పరిధిలోని జింద్–సోనిపట్ మార్గంలో 10 బోగీలతో కూడిన ఈ హైడ్రోజన్ రైలును నడపనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ నేడు ఒక ప్రకటనలో వెల్లడించింది. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. దీనికోసం 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. ఈ టెక్నాలజీలో హైడ్రోజన్‌ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియలో కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీంతో సంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే కాలుష్యం పూర్తిగా ఉండదు. ఈ చొరవతో హైడ్రోజన్ టెక్నాలజీని రైల్వే రంగంలో పరీక్షిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది. హర్యానాలోని జింద్–సోనిపట్ మార్గాన్ని ఈ పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. రైలుకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనాన్ని నింపేందుకు జింద్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రీఫ్యూయలింగ్, నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్ నిల్వ, పంపిణీ కోసం పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్ఓ) నుంచి అవసరమైన లైసెన్సు కూడా లభించింది. ప్రయాణికుల భద్రతకు రైల్వే అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జింద్‌లోని రీఫ్యూయలింగ్ కేంద్రంలో హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లతో సహా పలు భద్రతా సెన్సార్లను ఏర్పాటు చేశారు. రైలు నిర్వహణ కోసం షకుర్‌బస్తీలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటీలో కూడా కఠినమైన భద్రతా ప్రమాణాలను అమలు చేయనున్నారు. ఆర్‌డీఎస్‌వో ఆమోదించిన నిబంధనల ప్రకారం రైలు నిర్వహణ జరుగుతుందని, శిక్షణ పొందిన సిబ్బంది 24 గంటల పర్యవేక్షణలో ఉంటారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రారంభ దశలో రైలుతో పాటు సాంకేతిక సిబ్బంది కూడా ప్రయాణించి, పనితీరును పర్యవేక్షిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆవిష్కరణలు, ఇంధన సామర్థ్యం, పర్యావరణ హిత రవాణా పట్ల తమ నిబద్ధతను చాటుకుంటున్నామని భారత రైల్వే తెలిపింది. దేశంలో కర్బన ఉద్గారాలను తగ్గించి, నెట్–జీరో లక్ష్యాలను చేరుకునేందుకు ఈ హైడ్రోజన్ రైలు ఎంతగానో దోహదపడనుంది.




# చెన్నై సూపర్ కింగ్స్ కోచ్‌గా ఎంఎస్ ధోనీ!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని కీలకమైన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. ఈ జట్టు ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. ఇక్కడ సీఎస్కే జట్టు అనగానే గుర్తుకు వచ్చే పేరు ఎంఎస్ ధోని. సీఎస్కే అంటే ధోని.. ధోని అంటే సీఎస్కే అనే అంతలా మారింది.. ఆ జట్టు పరిస్థితి. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు సార్లు టైటిల్ అందించడంలో ఈ మిస్టర్ కూల్ ప్రధాన పోషించాడు. తాజాగా ధోనీ భవిష్యత్తుపై ఆ జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ సంచలన ప్రకటన చేశారు. మోకాలి గాయం కారణంగా ధోనీ ఐపీఎల్ 2026 సీజన్లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడలేకపోయాడు. దీంతో ధోనీ ఐపీఎల్ కెరీర్ ముగిసిపోయిందనే చర్చలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో సీఎస్కే జట్టు సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ.. ధోనీ జట్టులో ఏ పాత్రలో ఉండాలనుకున్నా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది పూర్తిగా అతడి వ్యక్తిగత నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. ధోనీ సీఎస్కే జట్టులోనే శాశ్వతంగా కొనసాగాలని తాము కోరుకుంటున్నట్లు వెల్లడించారు. 'ధోనీ సీఎస్కేలో ఏ పాత్రలో ఉన్నా మాకు ఆనందమే. ధోని ఆటగాడిగా ఉంటాడా, కోచ్‌గా మారతాడా లేదా మెంటార్‌గా సేవలందిస్తాడా అనేది పూర్తిగా అతడి ఇష్టం. సీఎస్కేకు సంబంధించిన ఏ నిర్ణయమైనా ధోనీ అభిప్రాయం పైనే ఆధారపడి ఉంటుంది' అని సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ధోనీ అధికారికంగా రిటైర్మెంట్ ప్రకటించనప్పటికీ.. వచ్చే సీజన్ నాటికి ఎంఎస్ ధోనీ సీఎస్కే మేనేజ్‌మెంట్‌లో కీలక బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందనే ఊహాగానాలకు సీఎస్కే సీఈవో వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి.

# గుజరాత్ టైటాన్స్‌పై గెలుపుతో

## ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు



డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. కెప్టెన్ రజత్ పటీదార్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో 93 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్‌కు బౌలర్ల దూకుడు తోడవడంతో వరుసగా రెండోసారి ఫైనల్‌కు చేరింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఏకపక్ష పోరులో ఆర్‌సీబీ 92 పరుగులతో భారీ విజయాన్నందుకుంది. ఇక చెత్త బ్యాటింగ్‌తో మూల్యం చెల్లించుకున్న టైటాన్స్ ఈనెల 29న క్వాలిఫయర్ 2లో మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 254 పరుగులు చేసింది. క్రునాల్ పాండ్యా (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 43), విరాట్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), దేవ్‌దత్ (19 బంతుల్లో 5 ఫోర్లతో 30) వేగం చూపారు. హోల్డర్, రబాడలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. తెవాటియా (43 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 68), బట్లర్ (11 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 29) మాత్రమే రాణించగా, ఎనిమిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. డఫీకి 3.. క్రునాల్, రసిఖ్, భువనేశ్వర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రజత్ నిలిచాడు.

ఆర్‌సీబీ బ్యాటర్లకు అద్భుతంగా సహకరించిన పిచ్.. గుజరాత్ ఇన్నింగ్స్‌లో మాత్రం దెబ్బకొట్టింది. బౌలర్లు టపటపా వికెట్లు తీయగా.. ఒక్కో పరుగు కోసం చెమటోడ్చింది. దీంతో 255 పరుగుల కష్టసాధ్యమైన ఛేదనలో గుజరాత్ పవర్‌ప్లేలోనే సగం జట్టును కోల్పోవడం గమనార్హం. చివర్లో తెవాటియా బ్యాట్ ఝుళిపించినా.. అప్పటికే జట్టు ఓటమి ఖరారైంది. అత్యంత విజయవంతమైన ఓపెనింగ్ జోడీగా పేరు తెచ్చుకున్న సాయి సుదర్శన్–గిల్ (2) తొలి మూడు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరారు. బట్లర్ బౌండరీలతో ఆకట్టుకున్నా అతడి ఆట 11 బంతులకే పరిమితమైంది. నిశాంత్ (5), హోల్డర్ (0)ను ఆరో ఓవర్‌లో పేసర్ రసిఖ్ అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో 51/5 స్కోరుతో టైటాన్స్‌కు పరిస్థితేమిటో అర్థమైంది. లోయర్ మిడిలార్డర్‌తో పాటు టెయిలెండర్లు కూడా ఇలా వచ్చి అలా వెళ్లడంతో గుజరాత్ 88 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో తెవాటియా ఎడాపెడా బౌండరీలతో స్కోరులో కదలిక తెచ్చాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తెవాటియా ఆటతో గెలుపు అసాధ్యమైనా.. ఓటమి అంతరాన్ని మాత్రం తగ్గించగలిగింది. 19వ ఓవర్‌లో భువీ అతడిని అవుట్ చేయగా.. తొమ్మిదో వికెట్‌కు సిరాజ్ (5)తో కలిసి 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ తొలి ఓవర్ నుంచే చెలరేగింది. బరిలోకి దిగిన ప్రతీ బ్యాటర్ వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక కెప్టెన్ రజత్ పటీదార్ డెత్ ఓవర్లలో సాగించిన విధ్వంసానికి జట్టు 250 దాటేసింది. అతడికి క్రునాల్ పాండ్యా సహకరించాడు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 47 బంతుల్లోనే 95 పరుగుల భాగస్వామ్యం అందించింది.




# 'పెద్ది' ప్రమోషన్స్... 'దేశీ ప్రిన్సెస్'లా మెరిసిపోయిన జాన్వీ కపూర్



బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. బెంగళూరులో తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఒక ప్రత్యేకమైన డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయ బెనారసీ వస్త్రానికి ఆధునిక హంగులు జోడించి రూపొందించిన గౌనులో జాన్వీ అచ్చం 'దేశీ ప్రిన్సెస్' (భారతీయ యువరాణి)లా మెరిసిపోయారు. సాధారణంగా బెనారసీ అంటే చీరనే గుర్తుకువస్తుంది. కానీ, జాన్వీ దానికి భిన్నంగా స్ట్రాప్‌లెస్ గౌనును ఎంచుకున్నారు. కార్సెట్ తరహా బాడీస్‌తో, ఫిట్‌గా ఉండే ఈ గౌను ఆమె అందాన్ని మరింత పెంచింది. లేత గులాబీ, మింట్, ఐవరీ వంటి పాస్టెల్ రంగుల కలయిక, బంగారు వర్ణంతో నేసిన పూల డిజైన్లు ఈ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. దీనికి జతగా చేతులపై కప్పుకున్న షీర్ పాస్టెల్ దుపట్టా రాజసమైన లుక్‌ను ఇచ్చింది. ఈ డ్రెస్‌కు తగ్గట్టుగా ఆక్సీడైజ్డ్ సిల్వర్ జుంకాలు, స్టేట్‌మెంట్ ఇయర్ కఫ్ వంటి మినిమల్ యాక్సెసరీస్ ధరించారు. నుదుట పాపిడితో వేసిన స్లీక్ బన్, గ్లోయీ మేకప్‌తో తన లుక్‌ను పూర్తిచేశారు. ఇటీవలే పర్పుల్ లెహంగాతో వైరల్ అయిన జాన్వీ, ఇప్పుడు ఈ బెనారసీ గౌనుతో సంప్రదాయ వస్త్రకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన బ్యాలెన్స్ ఎలా సాధించవచ్చో నిరూపించారు.

# 'కాటాలన్' ప్రమోషన్‌లో సునీల్ ఆసక్తికర వ్యాఖ్యలు



కమెడియన్‌గా కెరీర్ ప్రారంభించి, హీరోగా, విలన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు సునీల్, 'పుష్ప' చిత్రంలో మంగళం శ్రీను పాత్రకు ఎంపికవడం తనకూ ఓ షాక్ అని అన్నారు. ఈ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని, అన్ని భాషల్లోనూ అవకాశాలు తెచ్చిపెట్టిందని ఆయన తెలిపారు.

తన తాజా మలయాళ చిత్రం 'కాటాలన్' తెలుగు వెర్షన్ ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సునీల్ ఈ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'పుష్ప'లో విలన్‌గా సుకుమార్ మిమ్మల్ని ఎలా ఊహించుకున్నారని అడగ్గా.. "లాక్‌డౌన్ సమయంలో నేను కామెడీ పాత్రలు కాకుండా వేరేవి చేస్తున్నానని సుకుమార్‌కు చెప్పాను. రెండు రోజులకే ఆయన ఫోన్ చేసి 'పుష్ప'లో పూర్తిస్థాయి విలన్ పాత్ర ఉంది, కానీ కామెడీ చేయకూడదు, శరీరం కూడా కదపకుండా హావభావాలు పలికించాలని చెప్పారు," అని సునీల్ వివరించారు.

లుక్ టెస్ట్ కోసం పంపిన కాస్ట్యూమ్స్‌తో రకరకాలుగా ఫోటోలు తీసి పంపిం చా నని, అవి నచ్చడంతో ఆ పాత్రకు ఎంపికయ్యానని గుర్తుచేసుకున్నారు. షూటింగ్ జరిగినన్ని రోజులు పాత్ర కోసం నుదుటిపై షేవ్ చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు.

సునీల్ 'మారి' అనే కీలక పాత్రలో నటించిన 'కాటాలన్' చిత్రం మే 28న తెలుగులో విడుదల కానుంది. ఏనుగు దంతాల అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి పాల్ జార్జ్ దర్శకుడు. ఇందులో ఆంటోనీ వర్గీస్, కబీర్ దుహాన్ సింగ్, దుషారా విజయన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.






# 'యల్లమ్మ'కు అందుకే ఓకే చెప్పా: దేవి శ్రీ ప్రసాద్



ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. వేణు యెల్దండి దర్శకత్వంలో 'యల్లమ్మ' అనే చిత్రంలో ఆయన హీరోగా నటిస్తున్నారు. అయితే, ఒక అగ్ర సంగీత దర్శకుడిగా ఉండి నటన వైపు ఎందుకు అడుగులు వేశారనే దానిపై డీఎస్పీ స్వయంగా స్పందించారు. తను ఈ సినిమా చేయడానికి అంగీకరించడం వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించారు.

ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తన తండ్రి స్వగ్రామమైన వెదురుపాకలో తాను పర్యటించిన దృశ్యాలను అందులో చూపించారు. "చిన్నప్పటి నుంచి జానపద కళల పట్ల నాలో ఆసక్తిని నింపిన అద్భుతమైన సంప్రదాయాలు, సంస్కృతి ఇదే. మా ఊరిలో జరిగే 'అమ్మోరు జాతర' వేడుకలు నాపై తీవ్ర ప్రభావం చూపాయి. 'యల్లమ్మ'కు నేను ఎందుకు ఓకే చెప్పానో ఇదే కారణం" అని డీఎస్పీ పోస్ట్‌లో పేర్కొన్నారు.

చిన్నప్పుడు తన తండ్రి తమను చెన్నై నుంచి తరచూ ఈ గ్రామానికి తీసుకొచ్చేవారని, ఇక్కడి ప్రకృతి స్వచ్ఛతను ఆస్వాదించేలా చేశారని డీఎస్పీ గుర్తుచేసుకున్నారు. "మా మూలాలతో, మా వాళ్లతో సంబంధం కొనసాగేందుకు మేం ఇక్కడ అందమైన ఇల్లు కట్టుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం వంటి గొప్ప విషయాలను ఈ ఊరే నాకు నేర్పింది. అదే నాకు స్ఫూర్తినిచ్చింది" అని వీడియోలో వివరించారు. ఈ అనుబంధం కారణంగానే 'యల్లమ్మ' కథకు వెంటనే కనెక్ట్ అయినట్లు తెలిపారు.

దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణు యెల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం దర్శకుడు వేణు, డీఎస్పీ మధ్య తొలి సమావేశం ఏకంగా 8 గంటల పాటు సాగడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో డీఎస్పీ 'పర్శి' అనే పాత్రలో కనిపించనుండగా, సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**